క్లుప్తంగా

సీతక్కను కలిసిన కాంగ్రెస్ నేత



ఆమనగల్లు: నల్గొండ జిల్లా నాగార్జునసాగర్‌లో రాష్ట్ర ఎస్టీ కార్పొరేషన్ చైర్మన్ బెల్లయ్యనాయక్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గిరిజన సాధికారత శిక్షణ కార్యక్రమంలో ఆమనగల్లుకు చెందిన యూత్ కాంగ్రెస్ జిల్లా నాయకుడు కృష్ణనాయక్ పాల్గొన్నారు. ఏడు రోజుల పాటు జరిగే సదస్సులో గిరిజన నాయకులకు వివిధ అంశాలలో శిక్షణ ఇస్తున్నారు. శుక్రవారం సదస్సులో పాల్గొన్న రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖామంత్రి సీతక్కను కృష్ణనాయక్ సత్కరించారు.

ముందస్తుగా స్వామి వివేకానంద జయంతి



స్వామి వివేకానంద చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఆమనగల్లు: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో శుక్రవారం తెలంగాణ సామాజిక స్టూడెంట్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ముందస్తుగా స్వామి వివేకానంద జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వామిజీ మార్గంలో యువత పయనించాలని పలువురు కోరారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్‌ఉపాధ్యక్షుడు పాపిశెట్టి రాము, విద్యార్థి జేఏసీ నాయకుడు రాజు, నేతలు రాఘవేందర్, సుదర్శన్, రమేశ్‌నాయక్, చిక్కి, యాదగిరి, నాగరాజు, శివ, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు



ఉర్సు ఉత్సవాల్లో నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్: తులేకలాన్ దర్గాలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఉర్సు వేడుకలు మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తున్నాయని తెలిపారు. ఆయన వెంట మాజీ సర్పంచ్‌లు యాదగిరి, బుగ్గ రాములు, బీరప్ప, మాజీ ఎంపీటీసీ నాగమణి తదిరులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



ఉన్నత విద్యామండలి చైర్మన్‌ను సన్మానిస్తున్న స్కూల్ యాజమాన్యం

తుర్కయంజాల్: విద్యార్థులు చదువుతో పాటు, అన్ని రంగాల్లోను రాణించాలని తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ వి.బాలకిష్టారెడ్డి అన్నారు. తుర్కయంజాల్‌లోని ఇండస్ వ్యాలీ ఇంటర్నేషనల్ స్కూల్ వార్షికోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులు ప్రదర్శించిన ఎగ్జిబిట్లను పరిశీలించి, అభినందించారు.

సమస్యలు పరిష్కరించాలని ఆశల వినతి

మీర్‌పేట: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల మేరకు ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించేవిధంగా చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని వేడుకున్నారు. ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కవిత, అధ్యక్షురాలు కవిత ఆధ్వర్యంలో శుక్రవారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆశవర్కర్లు మాట్లాడారు. ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటి నెరవేర్చలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యలపై అసెంబ్లీలో చర్చించాలని వారు ఎమ్మెల్యేను కోరారు. దీనికి స్పందించిన ఆమె అసెంబ్లీలో తమ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం బాలాపూర్ మండల అధ్యక్షురాలు నీలావతి, ప్రధాన కార్యదర్శి తోట్ల భాగ్యలక్ష్మి, కోశాధికారి బి.సుజాత, సీఐటీయూ జిల్లా నాయకులు బుట్టి బాలరాజు, శేఖర్‌యాదవ్ పాల్గొన్నారు.



తుర్కయంజాల్: రంగనాథస్వామిని దర్శించుకున్న మల్‌రెడ్డి రాంరెడ్డి



కడ్తాల్: చెన్నకేశవస్వామిని దర్శించుకున్న భక్తులు

'ముక్కోటి' శోభ

వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం నియోజకవర్గం పరిధిలోని అన్ని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో ఉత్తర ద్వార దర్శనం కల్పించారు. ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

– ఇబ్రహీంపట్నం, ఆమనగల్లు బృందం



ఆమనగల్లు: తిరుమలలో కుటుంబ సభ్యులతో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



యాచారం: మండల కేంద్రంలో పూజలందుకున్న వేంకటేశ్వరస్వామి



తలకొండపల్లి: దేవునిపడకల్‌లో వేంకటేశ్వర స్వామి ఊరేగింపులో భక్తులు



అబ్దుల్లాపూర్‌మెట్: గౌరెల్లి నరసింహాస్వామి ఆలయంలో కమిటీ సభ్యులు



తుర్కయంజాల్: తొర్రూరులో పూజలందుకున్న రంగనాథ స్వామి

సర్కారు బడిలో సంక్రాంతి సంబరం

మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. సంప్రదాయ దుస్తులు ధరించి స్కూల్‌కు వచ్చిన విద్యార్థులు గాలిపటాలు ఎగరవేయగా, బాలికలు అందమైన ముగ్గులు వేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉత్సాహంగా ఆడిపాడారు.

– ఇబ్రహీంపట్నం రూరల్



కడ్తాల్: కేజీబీవీలో ముగ్గుల పోటీలు



ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల ప్రాథమిక పాఠశాలలో భోగి మంటలు



ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల పాఠశాలలో పతంగులు ఎగరవేస్తున్న విద్యార్థులు



మాడ్గుల: జూనియర్ కళాశాలలో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపాల్

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తుర్కయంజాల్: సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఆదిత్యానగర్ ఫీడర్ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 10నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ రవీందర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆదిత్యానగర్, జయసూర్య పట్నం, లక్ష్మీనగర్, జీబీఆర్ కాలనీ, శ్రీశ్రీ అవెన్యూ, గుర్రంగూడ, ఎస్‌బీఆర్ కాలనీ, సాయి దుర్గా కాలనీ, సాయి హోమ్స్, టీచర్స్ కాలనీ, టీచర్స్ గిల్డ్ కాలనీ, రాజలక్ష్మీ నగర్ ఫేజ్ 2, మ్యాట్రిక్స్ రిచ్ వ్యాలీ, స్వామి నారయణ్ కాలనీలో సరఫరా నిలిపివేయనున్నామని పేర్కొన్నారు.

భూ భారతితో రైతులకు మేలు

ఆమనగల్లు: రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిన భూ భారతితో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని ఆమనగల్లు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ యాట గీత అన్నారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో శుక్రవారం ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన భూ భారతి చట్టం చరిత్రలో మైలురాయిగా నిలిచిపోతుందని అన్నారు. రాష్ట్రంలోని 50 లక్షల మంది రైతుల సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఆమె చెప్పారు. భూ భారతి చట్టం అమలు కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

విద్యార్థులకు టీ షర్టుల అందజేత

మాడ్గుల: విద్యావ్యవస్థ బలోపేతమే ప్రభుత్వ లక్ష్యమని యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మహ్మద్ బాబా అన్నారు. సీఎం కప్ క్రీడల్లో భా గంగా ఎంపికైన విద్యార్థులకు శుక్రవారం మండల పరిధిలోని కలకొండ గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆయన టీ షర్టులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులు పదో తరగతిలో మంచి మార్కు లు సాధించాలన్నారు. విద్యా ద్వారానే బడుగు బలహీన వర్గాల అభివృద్ధి సాధ్యపడుతుందాన్నారు. ప్రధానోపాధ్యాయులు రవీందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతాంగ హామీలను నెరవేర్చాలి

- కిసాన్‌మోర్చా నేతల డిమాండ్
- తహసీల్దార్ సునీతారెడ్డికి వినతిపత్రం



ఇబ్రహీంపట్నం తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నేతలు

ఇబ్రహీంపట్నం: రైతాంగ సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని బీజేపీ కిసాన్ మోర్చా నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఇబ్రహీంపట్నం తహసీల్దార్ సునీతారెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ కాలేదని తెలిపారు. రైతుబంధు పత్తాలేదని, రైతు కూలీలకు రూ.12 వేలు ఇవ్వలేదని, ఫసల్ బీమా అమలు చేయడం లేదని మండిపడ్డారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతులకు పంట సాయాన్ని రూ.6 వేల నుంచి రూ.10 వేలకు పెంచిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నేతలు ముత్యాల భాస్కర్, నాయిని సత్యనారాయణ, కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు జక్క రవీందర్‌రెడ్డి, రమణారెడ్డి, విఠల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ పోరాటానికి మద్దతు

ఇబ్రహీంపట్నం: లక్ష డప్పులు, వెయ్యి గొంతుకుల ఎస్సీ వర్గీకరణ పోరాటానికి మద్దనిస్తామని ఇబ్రహీంపట్నం బార్ కౌన్సిల్ ప్రధాన కార్యదర్శి మంకు మరళి అన్నారు. ఇబ్రహీంపట్నంలో ఎస్సీ వర్గీకరణ మద్దతుదారులతో కలిసి శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. ఎమ్మార్పీఎస్ ఆవిర్భవించి ముప్పై ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహిస్తున్న కార్యక్రమానికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు అరుణ్‌కుమార్, అంబాచారి, జిల్లా మాదిగ జేఏసీ గౌరవ అధ్యక్షుడు బోసుపల్లి ప్రతాప్, భాస్కర్, యాదయ్య, బోడ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



వర్గీకరణకు మద్దతుగా న్యాయవాదులు

అభివృద్ధి పనులు పూర్తి చేయండి

బీఆర్‌ఎస్ ఆమనగల్లు అధ్యక్షుడు పత్యానాయక్



తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ఆమనగల్లు: పట్టణంలో గత ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన వివిధ అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని బీఆర్‌ఎస్ ఆమనగల్లు అధ్యక్షుడు పత్యానాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నాచేసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పత్యానాయక్ మాట్లాడుతూ.. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణానికి రూ.4.5 కోట్లు, జూనియర్ కళాశాల భవన నిర్మాణానికి రూ.2.5 కోట్లు మంజూరు చేశారన్నారు. ఆయా అభివృద్ధి పనులు ప్రారంభించిన అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతో నిధులు నిలిపివేశారని ఆరోపించారు. నిలిచిపోయిన అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసి పూర్తిచేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ నిరంజన్‌గౌడ్, మాజీ సర్పంచ్ శ్రీనునాయక్, నాయకులు ఖలీల్, సాయిలు, వెంకటయ్య, వెంకటేశ్, రమేశ్, శివకుమార్, యాదయ్య, సైదులుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆశలకు కనీస వేతనం ఇవ్వాలి

- సీఐటీయూ జిల్లా నేత కార్యదర్శి బ్రహ్మయ్య
- ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట ధర్నా



ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వినతిపత్రాన్ని అంటించి ధర్నా చేస్తున్న సీఐటీయూ నేతలు

ఇబ్రహీంపట్నం: ఆశ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి బ్రహ్మయ్య డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఎమ్మెల్యే అందుబాటులో లేకపోవడంతో కార్యాలయం గేట్‌కు వినతిపత్రం అంటించారు. అనంతరం బ్రహ్మయ్య మాట్లాడుతూ.. ఇరవై ఏళ్లగా గ్రామాల్లో సేవ చేస్తున్న ఆశ వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం లేదన్నారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ఆశ వర్కర్లకు రూ.18 వేల వేతనం ఇచ్చేలా తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు బుగ్గ రాములు, చందు నాయక్, ఎల్లేశ్, యాదగిరి, ఆశ వర్కర్లు మణెమ్మ, సుకన్య, లావణ్య, నాగమణి, చంద్రకళ, మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో క్రీడాభివృద్ధికి కృషి



టోర్నీ విజేతలతో నర్సింహారెడ్డి, సినీనటుడు ప్రభాస్ శ్రీను తదితరులు

టీయూఎఫ్ఐడీసీ చైర్మన్ నర్సింహారెడ్డి

కడ్తాల్: రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహం అందిస్తుందని టీయూఎఫ్ఐడీసీ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి అన్నారు. మండల కేంద్రంలో జిల్లా ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో కడ్తాల్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు శుక్రవారం ముగిశాయి. ముఖ్య అతిథులుగా టీయూఎఫ్ఐడీసీ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ యాట గీత, సినీ నటుడు ప్రభాస్ శ్రీను హాజరయ్యారు. అనంతరం టోర్నీలో విజేతగా నిలిచిన కడ్తాల్ ఈగల్స్ టీంకు బహుమతి అందజేశారు. అలాగే టోర్నీలో ప్రతిభ చాటిన క్రీడాకారులకు మెమొంటోలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, రమేశ్, హన్మానాయక్, నర్సింహ, బీచ్యానాయక్, రాములుగౌడ్ తదితరులు ఉన్నారు.

సాలార్‌పూర్‌లో..

క్రీడలతో శారీరక ఆరోగ్యంతో పాటు, మానసిక వికాసం పెంపొందుతుందని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు జర్పుల దశరథ్‌నాయక్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని సాలార్‌పూర్ గ్రామంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని, క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రమేశ్, పంతునాయక్, సాయిలు, బాబా, జంగయ్య, కుమార్, నరేశ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

మున్సిపల్ అభివృద్ధికి కృషి

చైర్‌పర్సన్ హేమలత



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్

తుక్కుగూడ: తుక్కుగూడ మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తానని చైర్‌పర్సన్ బరిగెల హేమలత పేర్కొన్నారు. శుక్రవారం మున్సిపాలిటీ కేంద్రంలోని 9వ వార్డులో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. రోడ్డు నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్లు నాణ్యత విషయంలో రాజీ పడొద్దన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు శివకుమార్, భావన, నాయకులు రాజు, దేవేందర్, శేఖర్, కాలనీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.

సర్వర్ సతాయిస్తోంది!

నిలిచిపోతున్న భూముల రిజిస్ట్రేషన్లు

- ఆందోళనలో క్రయవిక్రయదారులు



యాచారం తహసీల్దార్ కార్యాలయం

యాచారం: సర్వర్ డౌన్‌తో యాచారం తహసీల్దార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు నిలిచిపోతున్నాయి. వారం రోజులుగా ధరణి సర్వర్ సమస్యతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నెల 6వ తేదీ నుంచి శుక్రవారం వరకు మండలంలోని వివిధ గ్రామాల్లో భూముల క్రయవిక్రయాలకు సంబంధించి దాదాపు 75కు పైగా స్లాట్లు బుక్ అయ్యాయి. వీటిలో సగం వరకు రిజిస్ట్రేషన్లు కూడా పూర్తి కాలేదు. దీంతో పెద్ద మొత్తంలో డబ్బులు చెల్లించిన కొనుగోలుదారుల్లో ఆందోళన నెలకొంటోంది. సమయం గడిచినా కొద్ది కొత్త సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.



సర్వర్ డౌన్‌తో రిజిస్ట్రేషన్ గదిలో నిండిపోయిన భూ క్రయవిక్రయదారులు

పని ఒత్తిడి..

ఫార్మాసిటీ భూసేకరణ, గ్రీన్ ఫీల్డ్ రోడ్డు నిర్మాణం సర్వే, ఉన్నతాధికారులతో సమావేశాలు, ఇతర ముఖ్యమైన మీటింగ్‌ల నేపథ్యంలో యాచారం తహసీల్దార్ పూర్తి స్థాయిలో ఆఫీసు వద్ద అందుబాటులో ఉండటం లేదు. ప్రతీరోజు ఉదయం 11నుంచి మధ్యాహ్నం 2గంటలు దాటినా ఒక్క రిజిస్ట్రేషన్ కూడా కావడం లేదు. ఒకవేళ సర్వర్ పనిచేసినా స్లోగా ఉండటంతో ఒక్కో రిజిస్ట్రేషన్‌కు సుమారు గంటన్నర సమయం పడుతోంది.

ఆందోళన చెందొద్దు



కొద్ది రోజులుగా ధరణి పోర్టల్ సర్వర్ సత్తాయిస్తోంది. ఈ విషయాన్ని టెక్నికల్ సిబ్బంది, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. పెండింగ్ స్లాట్ల రిజిస్ట్రేషన్లు పూర్తి చేస్తున్నాం. శుక్రవారం నుంచి సర్వర్ స్పీడ్ అందుకుంది. ఆందోళన చెందాల్సిన పనిలేదు.

– అయ్యప్ప, తహసీల్దార్ యాచారం

ఫ్యూచర్‌సిటీ, గ్రీన్ ఫీల్డ్ రోడ్డు నిర్మాణంతో..

మండలంలోని భూముల్లోనే ఫ్యూచర్‌సిటీ, 330 అడుగుల గ్రీన్ ఫీల్డ్ రోడ్డు నిర్మాణంతో నస్దిక్‌సింగారం, నందివనపర్తి, చౌదర్‌పల్లి, మల్కీజ్‌గూడ, నక్కర్తమేడిపల్లి, యాచారం, తక్కళ్లపల్లి, కొత్తపల్లిలోని వ్యవసాయ భూముల ధరలు భారీగా పెరిగాయి.